# ప్రదక్షిణ నాయకుడు

శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి

కృష్ణారావు ఎల్లా పసికట్టాడో తెలియదుగాని లీల, మాల, హేల ముగ్గురూ ఒక యింట్లోనే ఉంటున్నారని యీలలు లాగాడు. వారందరూ కలిసే ఉంటున్నారనీ సమిష్టిగా వంటచేసుకుని భోజనంచేసి కరెక్టు టైముకు కాలేజీకి వస్తారనీ తెలిసికున్నాడు. ఇల్లా తెలిసికోవడంలో అతడు కృతకృత్యుడు కావచ్చు, కాని చాలమంది కాలేజీ స్టూడెంట్లు తెలిసికోవాలని ఊహ ఉన్న వారే. వారు ముగ్గురూ చలాకీ తనంలో ఒకరి కొకరు తీసిపోనివారుగా ఉండడం, మంచి మార్కులు తెచ్చుకోవడం, ఇవన్నీ విద్యార్థుల దృక్కులు వారిపై కేంద్రీకరింపబడడానికి కారణాలే. వాకబు చేసిన మీదట వారందరూ ఒకే కులానికి చెందినవారని తేలడమే కాక, వారి తల్లిదండ్రులు కూడా ఆ విధంగా వారు సహకరించడం ఇష్టపడిన వారనే తేలింది సమ వయస్కులైన ముగ్గురూ నడుస్తూ ఉంటే కాళిదాసు పాత్రలు అనసూయ, ప్రియంవద, శకుంతల నడుస్తున్నట్లే ఉండేవి. అయితే ముగ్గురు ఆకారాలలోనూ ప్రకృతులలోనూ భేదం లేదనడానికి వీలులేదు. కవల పిల్లలకే కించిత్తు భేదం ఉంటున్నప్పుడు మిగిలినవారికి లేకుండా ఉంటుందని ఊహించడం కూడా అంత సబబు కాదు. ఆశ్రమంలో ఉండేవారు కాబట్టి వారు నారచీరలు కడితే వీరు నైలాన్ చీరలు కట్టేవారు.

పరిశీలనగా చూస్తే లీలది మిగిలిన వారికంటె కొంచెం స్థూలశరీరం అనవచ్చు. విశాలమైన నుదురు చక్రాలవంటి కళ్లు, ఏ భావమైనా ముఖంమీద ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. మోదం వచ్చినా ఖేదం వచ్చినా చరమావస్థను చూచేది. వేషం కడితే ఒక మహారాణివలె ఉంటుంది.

మాల కొంచెం కుదిమట్టం మనిషి. కూర్చుంటే గన్నేరు పూలు కుప్పపోసినట్లుండేది. మిల్లి ముఖమయినా తీర్చిదిద్దిన పలు వరుస. ముఖంలో వెలసిన ఒక చిన్న రేఖలో అనంతములయిన భావాలు గూడుకట్టుకుని ఉండేవి.

ఇక హేల రూపం చూడగానే రమణీయం అని చెప్పలేం. కాని ఆ కళ్లు జగత్తును గెలిచే సామర్థ్యం కలవి. స్వభావంగా నవ్వినా తెచ్చుకోలు నవ్వు నవ్వినట్లే ఉంటుంది కాని అది ఎదిరి గుండెల్ని గుప్పెట్లో పెట్టుకుంటుంది. నడుస్తూ ఉంటే ఒక విలాసం, నిలబడితే ఒక భంగిమ; నాట్యం నేర్చుకోకపోయిన నట్టువరాలి కళా వైశద్యం పోతపోసిన ప్రతిమ హేల.

లీల ఏ మాత్రం అలంకారం చేసికొన్నా కొట్టవచ్చినంత శోభాయమానంగా ఉండేది. మాల పచ్చని దవడంచేత తగుమాత్రం అలంకరణమే చేసికొని ఒప్పిదంగా ఉండేది హేల కావాలని అలంకారం చేసికొనేది కాని అది చక్కగా నప్పినట్లు ఉండేది. అయితే యీ అలంకరణాలు వారు చేసికోవడం స్వభావంగానే గాని యువకులుల నాకర్షించడానికి కాదు. కాని వారికి తెలికుండానే వారితరుల నాకర్షిస్తున్నారనే విషయం వారు గమనించని మాట సత్యం. కాని మల్లెచెండు సిగలో సంతరించుకున్న తరుణి ప్రక్కవారికి తాను ఘ్రాణ తర్పణం చేస్తున్నట్లుగా భావించకపోయినా అయాచితంగా సంభవించిన సౌరభాన్ని ఇతరు లాఘ్రాణించకుండా ఉండలేరు. ఆఘ్రాణించడం అలవాటు పడినవారు మరింత ఆస్వాదించవలెననే కోరికనూ చంపుకోలేరు. అల్లాగే ఉల్లిపొర చీరలకు మోజుపడేవారు సౌలభ్యంకోసం సౌందర్యం కోసం ఆశించినా ప్రేక్షకులా చీరలలో నుండి శరీరపు తళ్తళలు కూడా గమనించకుండా కూడాఉండలేరు. కాగా కొన్ని కొన్ని అలంకరణ విధానాలు కొన్ని ప్రదేశాలకే పరిమితంచేసి లోకదృష్టి కలవారికే ప్రత్యవాయం ఉండక పోవచ్చుగాని బహిరంగంగా వారితరుల నాకర్షిస్తూ ప్రేక్షకులను తప్పుపట్టడంమాత్రం వాంఛనీయమైనది కాదు.

ఏమయినా కన్యాత్రియం ఆకర్షణంలో పడ్డ వారిలో కృష్ణారావొకడు. ఇతరులు చక్షుః ప్రీతి మాత్ర తుష్టులయితే కృష్ణారావు మరొక్క అడుగు ముందుకు వేయాలనుకున్నాడు. అందుచేత వారి గృహం చుట్టూ తనూ ఆకర్షణీయమైన దుస్తులు ధరించి ప్రదక్షిణం చేయడం మొదలు పెట్టాడు.

ఆ వీధిలోనే తనకు రూము అద్దెకు కావాలని ఇంటింటికీ వెళ్లి అడిగాడు. సంసారంచేసే యిళ్లల్లో విడి మనిషికి ఎవరూ అద్దెకివ్వం పొమ్మన్నారు. కాని సరిగా యీ రత్నత్రియం ఉన్న యింటి కెదురుగా ఉన్న ఇల్లాలు అద్దెకోసం కక్కుర్తి పడింది. రెట్టింపు అద్దెను కృష్ణారావు ప్రలోభ పెట్టేసరికి ఆమె కళ్ళు తిరిగిపోయి మేడమీద ఉన్న ఒకే ఒక గదిని ఇవ్వడానికి ఒప్పుకొంది. దానితో కృష్ణారావుకు ప్రభాత దర్శన భాగ్యం అబ్బింది. రత్నత్రియానికీ విషయం పెద్దగా పట్టలేదు. అసలు తమ కాలేజీలో చదివే ఒక జీవి, తమ యింటి యెదురుగా ఉన్నాడనే విషయమే వారు గమనించలేదు కొన్నాళ్ళు.

ఈ ఎదురు బొదురు ఇళ్లల్లో పనిచేసే దాసీ కన్య ఒక్కర్తే కావడం వల్ల. ఈ కొత్తగా వచ్చిన గది కసువు చిమ్మడానికి కూడా ఆదాసీనే మాట్లాడి ఇంటి యజమానురాలైన వృద్ధ వితంతువు కుదర్చడం వల్ల, ఆ దాసీ వల్ల మాత్రం ఆ గదిలో ఒక స్టూడెంటు ఉంటున్నట్లు రత్నత్రయానికి తెలిసింది.

డిశంబరు పరీక్షలకు ముందు ఒకసారి కాలేజీ పరిసరాల్లో మందహాసం చేసి "మీ యింటి ఎదురుగానేనండి నేఉంట" అని తన్ను తాను పరిచయంచేసికున్నాడు. "అల్లాగా" అంది లీల "ఆ వీధిలో ఎవరుంటున్నారో కూడా మాకు తెలియదు" అంది మాల. "ఇంట్లో వృద్ధ వితంతువుకు మీరేమవుతారని" అడిగింది హేల. "నేను అద్దె కుంటున్నాను ఒక్కడినే. వారికి నేనేమీ కాను" అని చెప్పాడు కృష్ణారావు.

పని మనిషి. అసలు పేరేమిటో తెలియదు కాని దానిని "గాలి" అని పిలుస్తారు. అడగకుండానే కాఫీ డబ్బులిచ్చి దానిని మాట మచ్చిక చేసుకున్నాడు కృష్ణారావు. త్రిరత్నాల ఇంట్లో కబుర్లు చల్లగా తెలుసుకోవడం ప్రారంభించాడు. వాళ్ళు ఏ రోజున ఏ క్లాసుకు సినీమాకు వెడతారో తెలిసికొని ఆ ఆటకు తానూ తయారయే వాడు. వాళ్ళు చదువుకునే ఆడవాళ్లు కనుక ఆడవాళ్ల విభాగంలో సినీమా హాల్లో కూర్చోడానికి సందేహిస్తారు. మగవాళ్ల విభాగంలోకి వచ్చేసరికి ఇంచుమించుగా తన సీటు వారి దగ్గరఉండే ఏర్పాటు చూచుకునేవాడు కృష్ణారావు ఇతనితోపాటు కలిసి ఇకిలించాలని ఇకిలించక పోయినా సినీమాలో నవ్వు వచ్చే ఘట్టాల్లో నవ్వడం ఆ నవ్వడం ఇతడు గమనిస్తాడని తెలియగానే వాళ్ళ ముఖం ముడుచుకోవడం జరుగుతూ ఉండేది.

ఒకరోజున శేషవర్షం మళ్లే తెల్లవారే సరికి వచ్చాడు త్రిరత్నాల యింటికి. మాల నిద్దుర లేవలేదు. లీల నిద్దుర లేచింది. ముఖమార్జనానికి వెళ్ళింది. హేల స్నానానికి వెళ్లబోతుంది. ఈ జీవుడిల్లా తెల్లవారే సరికి తయారవుతాడని వాళ్లూహించలేదు. హేల మాత్రం చాలీచాలని కొయ్య ముక్కాలి పీట టైట వసా

(తరువాయి 19 వ పేజీలో)

# ప్రదక్షిణ నాయకుడు

(10 వ పేజీ తరువాయి)

రాలో బొగ్గులబస్తాకు దగ్గరగావేసి కూర్చోమంది. కృష్ణారావు కూర్చున్నాడు "మీరు ఆలస్యంగా నిద్రలేస్తారు కాబోలు"న్నాడు హోల ఒక తెచ్చుకోలు నవ్వునవ్వింది "రాత్రి సినిమా ఎల్లా ఉందంటారు" అన్నాడు. లోపల నుండి లీల అందుకుంటూ "నా మొహం" అల్లే ఉంది అంది." అయితే బాగున్నట్లే అందామనుకున్నాడు. కాని తొందరపడలేదు. హోల "మీరు చెప్పండి మీకు ఎల్లా ఉందో" అంది. కృష్ణారావు ఒక పావుగంట తాను గుణ దోషాలనుకున్నవి చెప్పుకు పోయాడు. అంతా విన్న తర్వాత హోల "నేనూ అల్లాగే అనుకున్నానండి" అని బాత్ రూములోకి వెళ్ళిపోయింది. ఈ కబుర్లకు నిద్దుర లేచిన మాల "ఎవరే ఒకటే గొణ గొణ" అంది నిద్దుర లేవకుండానే. "ఎవరూ లేరు. నీ కెందుకు నువ్వు నిద్దురపో" అంది లీల. "సెలవు" మీ అమూల్యమైన కాలాన్ని వృధా చేశానని కృష్ణారావు లేచాడు. లీల "మా మాల ఏమీ కాలం వృధా కాకుండా నిద్రపోతుంది"అంది. కృష్ణారావు వెళ్లిపోయిన తర్వాత ముగ్గురూ చేరారు. "ఇదొక దిన దిన తద్దినం కాబోలు" అని లీల అంటే అందరూ నవ్వుకున్నారు.

లీల ఒక్కర్తే ఒక రోజున ఇంటి దగ్గర కూర్చుంది మాల హోల బజారుకు వెళ్లారు. గాలి వచ్చి "అమ్మగారూ" అంటూ ఖంగారు పడుతూ దగ్గరగా కూర్చుంది." ఏమిటే గాలీ! నీకు ముచ్చెమటలు పోస్తున్నై" అంది లీల. "ఏమీ లేదండీ అమ్మగారూ! నేనొక మాట చెబుతాను మీరేమయినా కోప్పడనని ఒక మాట యివ్వండి" అంది గాలి, "కోపం దేనికి చెప్పులే అంది "లీల. "ఈ జాబు మీకిమ్మని చెప్పి నాకు పది రూపాయలిచ్చారండీ ఎదురింటి కుర్రాయన. మీకు నచ్చితే సరే, లేకపోతే గల్లంతు చెయ్యకండి" అని రెండు కాళ్లూ పుచ్చుకుంది. లీల అగ్గి అయిపోయింది కాని ఏమీ అనలేదు. ఆ జాబు తీసికొంది. "నాకు ఒంట్లో బాగుండలేదు నువ్వు వెళ్ళు" అంది. "అమ్మగారూ! నాకిచ్చిన మాట తప్పకండి. అల్లరిచేస్తే మీకూ నాకూ కూడా అల్లరి. ఆయనకేం మొగ రాజు" అని వెళ్ళిపోయింది. మాల, హోల బజారునుండి వచ్చేసరికి లీల కళ్ళు 'బోరుగండ' లయినై. వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది. "ఇంటి దగ్గర ఎవరికైనా అపాయం" అని జాబు వచ్చిందా అని మాల ప్రశ్నించింది.

లీల జాబు చేతికిచ్చింది. మాల జాబు చదివి హోలకిచ్చింది. హోల చదివి అక్కడ పడేసింది. ఇద్దరూ చెరొక నిట్టూర్పు విడిచారు. మాల తాను చెప్పు తీసికొని వెళ్ళి కృష్ణారావును రూములోనే చెంపలు వాయించి వస్తానన్నది హోల అందుకు ఒప్పుకోలేదు. తాపీగా కుంపటి రాజేస్తోంది ఉత్తరం కాస్త కాస్త చింపి కుంపటిలో రాజుకున్న తర్వాత వేస్తోంది. ఈ క్రియా కలాపం చూచి లీల పక్కున నవ్వింది. మాల హోల చేతిలో ముక్కలు కొన్ని లాక్కొని తాను కూడా కుంపటిలో దాఖలు చేసింది.

కొన్నాళ్లు జరిగింది గాలికి లీలను సమాధానంగా జాబు వ్రాసిమ్మనే ధైర్యం లేకపోయింది. ఏమీ జరగనట్లే అందరూ వ్యవహరిస్తున్నారు. అయితే హోల మాత్రం కృష్ణారావు ఇంటికేసి వాని వికారాల కనిపెట్టం కోసం చూస్తూ ఉండేది. లీల ఆ పనికి అసహ్యించుకునేది. హోల నవ్వుకునేది. ఒకరోజున మాల ఒక్కర్తే ఇంట్లో ఉన్న సమయంలో ఒక లేఖను కృష్ణారావు వ్రాసి గాలిచేత పంపాడు లీల విషయంలో చెప్పిన కబుర్లన్నీ చెప్పి అదే ధోరణిలో గాలి ఆ ఉత్తరం మాలకు అందజేసింది. గాలి వెళ్ళిపోయింది. హోలకు లీలకు ఆ జాబు మాల చదివి వినిపించింది. ఆ జాబులో కేవలం తననే అతడు ప్రేమిస్తున్నట్లు ఉంది లీల "సిగ్గులేక చదివి వినిపిస్తోంది. చూడు. ఆ రోజు చెప్పు పుచ్చుకుని కొడతానన్నావు. ఇవాళేం చేస్తావు ఆ తుంటరిని" అంది. "అంత పనీ ఇప్పుడే చేస్తా. పైగా జుట్టు పట్టుకుని నీ దగ్గరకే ఈడ్చుకు వస్తా" అని మాల లేచింది. హోల రాజేస్తున్న కుంపటిని చూపి "దీని ఆకలి ఎల్లా తీరుతుంది" అంది. లీల నవ్వింది హోల నవ్వింది. కాని మాల నవ్వనే లేదు. "సిగ్గుండాలి. ఏమని వెడతావు వాడి దగ్గరకు" అంది హోల. లేచి జాబు లాక్కుంది కుంపటిలో వేసి ఊదుతోంది. "నీకు ఒంట్లో కారం ఉంటే యీ కుంపటి ఊదు వాడి కర్మ ఎల్లా కాలుతుందో చూస్తావు" అంది. మాలకు ఇంకా నవ్వు రాలేదు. "నీకే ఇల్లాంటి జాబు వస్తే ఏం చేస్తావు'' అంది హోలతో. "ఏమో" అంది హోల నవ్వుతూ, "మళ్ళీ సమాధానం వ్రాస్తావా" అంది మాల కోపంతో "ఏమో" అంది మళ్ళీ హోల. అందరూ నవ్వారు. ఇంతట్లో ఆ జాబు భగ్గుమని అంటుకుని సుర సురా కాలిపోయింది ఇంతవరకు ఇద్దరును ప్రేమించాడు పాపం ఈ నాయకుడు. నన్ను కూడా ప్రేమించడని ఏముంది ఈ దక్షిణ నాయకుడు" అంది హోల. దక్షిణ నాయకుడు కాదు వీడు. వీడంటే ఇష్టపడింది ఎవత్తె వీడు ప్రదక్షిణ నాయకుడు "అంది మాల''. అలంకార శాస్త్రంలో ఎక్కవలసిన నాయకుడే" అంది లీల.

అందరూ విరగబడి నవ్వారు. "ఈ గాలి ముండను మనం నౌకరీ తీసివేయాలి" అంది లీల. "ఇంకొక్క జాబు వచ్చిన తర్వాత అందరూ సమానం అవుతాం తర్వాత చేయవచ్చు" అంది హోల.

మళ్లీ కొంతకాలం జరిగింది. ఈ సంగతి ఎవరికీ పట్టనేలేదు. కృష్ణారావుకు మాత్రం చొరవ చిక్కింది ఫలితం దక్కలేదు. కాని ఒకరోజున హోల నవ్వడం గమనించాడు. తాను ఆ పిల్లకు జాబు వ్రాస్తే త్వరగా జవాబు వచ్చేదనుకున్నాడు "ప్రేమలేఖల" పుస్తకంలో నుంచి వెనుకటి మోస్తరుగానే నకలు దింపేశాడు. హోలనే ప్రేమిస్తున్నట్లు వ్రాశాడు. మిగతా ఇద్దరూ లేనప్పుడు "గాలి" వెనుకటి పద్ధతిలోనే హోలకు అందచేసింది లేఖను. హోల తనకు జాబు వచ్చినట్లు ఎవ్వరికీ చెప్పలా కాని కుంపటి వెలిగించి మిగిలిన ఇద్దరూ చూస్తుండగానే అందులో వేసింది. ముఖంలో ఏ భావమూ లేదు కాని ఒక నిట్టూర్పు విడచింది. మాల అంది "ప్రదక్షిణ నాయకుడు" జాబేనా? అని, లీల "బహుశా అదే" అంది హోల కాదని అనలేదు. "మన కుంపటికి ఇక పని తగలదు'' అంది హోల. ఆమె మనస్సులో ఏముందో ఇద్దరికీ ఏమీ తెలియలేదు.

ఈ మూడు జాబుల్లోనూ ప్రధానమైన లక్షణమేమంటే చివర ప్రియుడు కృష్ణారావు సంతకం పెట్టిన ప్రియురాలి పేరు మాత్రం వ్రాయకుండా ప్రియురాలా! అని సంబోధిస్తూ వ్రాయడమే పరిపాటి ఆ రోజున హోల ఒక తెచ్చుకోలు నవ్వుతో కృష్ణారావును చూచి మందహాసం చేసింది, తిరిగి ఒక "జాబును"ను గాలి తీసికొని హోల ఏకాంతంగా ఉన్నప్పుడు దాఖలు చేసుకుంది.

కృష్ణారావు ఉండే మేడ క్రింద ఇంటి వారుంటున్నారు, వాళ్లమ్మాయికీ హోలకూ ఎంతో స్నేహం. ఈ జాబు రాగానే వారింటికి వెళ్ళింది హోల, ఆ అమ్మాయి ఇంట్లో లేదు. కాసేపు కూర్చుని వెంటనే వచ్చేసింది.

ఇంటి వారమ్మాయి ఇంటికొచ్చింది. నిప్పులు త్రొక్కింది. వాళ్లన్నయ్యకు ఒక జాబు చూపించింది. "ఈ కిష్టిగాడి" ఇల్లిస్తే తిన్నయింటి వాసాలు లెక్కపెడతాడా బుద్ధి" అన్నాడు ఆ అన్న. వెంటనే సరాసరి మేడ మీదకు వెళ్లాడు. జుట్టు పట్టుకుని బైటికి లాగాడు. ఆ చుట్టు పక్కల వాళ్ళను పోగుచేశాడు. ఆ ఉత్తరం బయటపెట్టాడు. నోట్సు పుస్తకాలన్నీ బైట పారవేశాడు. "చూడండి దస్తూరి ఈ వెధవే వ్రాశాడు సంతకం కూడా ఏడిచాడు. పెద్ద మొగాడట్లే" అన్నాడు.

ఈ లోపుగా ఇంటి వారమ్మాయి చెప్పతీసికొని "ఫెడే ఫెడే" దవడలు వాయించింది. బాగా దెబ్బలు తగిలిన తర్వాత ఇరుగుపొరుగువారు వచ్చారు. తాగేందుకు మంచినీళ్ళిచ్చారు కృష్ణారావు సొమ్మసిల్లి పడిపోతే. ఒక మధ్యవర్తి వచ్చి "ఈ దస్తూరి నీదేనా" అని అడిగాడు కృష్ణారావును ఆ దస్తూరీ నాదే కాని నేను ఆ అమ్మాయికి వ్రాయలేదు" అని అందామనుకున్నాడు. "ఎవరికి వ్రాశానంటే" వాళ్ళే మళ్ళీ కొడతారేమో! ఇంకొక పేరు బయట పెట్టడం దేనికి అని తగ్గాడు. "ఆ అమ్మాయి పేరు ఆ జాబులో ఏముందండీ" అన్నాడు. "పేరు లేక పోయినా నువ్వు పడవేసింది ఆ అమ్మాయి గదిలోనేగా, ఎవరు వస్తారు ఈ యింట్లోకి ఇంకొకరు పడవేయపోనికి ఇంకొళ్ళ జాబు ఆ అమ్మాయి గదిలోకి ఎందుకు వెడుతుంది" అన్నాడు మధ్యవర్తి.

"అల్లా గడ్డి పెట్టండి నోట్లో" అన్నాడు ఇంటి వారమ్మాయి అన్న.

ఒకవేళ ఈ గాలి ముండ ఈ అమ్మాయి గదిలోనే మంగమతితో పడవేసిందేమోనని కృష్ణారావు మరి మాట్లాడలేదు.

ఇంతట్లో ఈ హడావిడి చూచి లీల, మాల, హోల వచ్చారు ఎదురింట్లో నుంచి, పాపం ఆ అబ్బాయిని ఎందుకండీ ఇంకా కొట్టడం అంది.

"చూడు హోలా! రాస్కెల్! ఎల్లాంటి పని చేశాడో!" అని ఆ జాబు అన్న చేతిలో నుంచి లాక్కొని హోల చేతికిచ్చింది.

హోల కృష్ణారావుతో "మీరు మర్యాదగా ఇప్పుడే ఇల్లు ఖాళీచేసి వెళ్లిపొండి" అంది. కృష్ణారావు ఆమె తన క్షేమం కోసమే చెబుతుందని గ్రహించాడు. గత్యంతరం లేదు, ఉన్నకొద్దీ వీపు నగారా మోగవచ్చు. సరె ఖాళీ చేస్తా"నన్నాడు.

'ఇప్పుడే చెయ్యాలి. ఒక గంట టైమిస్తున్నా' నన్నాడు ఇంటి వారమ్మాయి అన్న.

వెంటనే అనేసింది హోల. పోనీ సామాను మా యింటి పంచలో పారవేసి వెళ్లిపొండి. 1, 2, రోజులలో మీరు రూము చూచుకున్న తర్వాత తీసికొని వెళ్లవచ్చు"

"ఆ లుచ్చాను మీ యింట్లో ఎందుకు అడుగు పెట్టనిస్తారమ్మా" అన్నాడు ఇంటి వారమ్మాయి అన్న.

"పోనీ, అన్నా! ఈ పీడ మనకు విరగడై పోనీ. ఒకటి రెండు రోజులేగా హోల టైమిచ్చింది, ఆ రెండు రోజులు దాటితే వాటిని రిక్షామీద కెక్కించి కృష్ణలో పారేసి వస్తాను" అంది.

మధ్యవర్తులు ఆ సామానంతా హోలయింటికి చేర్చారు. కృష్ణారావు గుడ్లప్పగించి చూస్తున్నాడు. ఇల్లు ఖాళీ అయిన తర్వాత తన ఫ్రెండ్ రూముకు వెళ్లిపోతానని చెప్పాడు. మరురోజు తెల్లవారిన వెంటనే సామాను తీసికొని పోయాడు. మళ్ళీ ఆ వీధిలో ముఖం కనపరచడం ఇష్టంలేక గాలి వచ్చి ఆ సామాను రిక్షాలో పెట్టింది. "వెళ్లి వస్తా గాలీ!" అని బిక్క ముఖంతో వెళ్లిపోయాడు. గాలి కొంత దూరం సాగనంపటానికి వెళ్లింది

హోల మాలతోనూ లీలతోనూ ఒక కథ చెప్పడం ప్రారంభించింది. ఒక పాము పక్షుల గుడ్లను తినేసేది చెట్టెక్కి. ఆ పక్షులకు ఏమి చేయడానికి తోచలేదు. ఒక పక్షి రాజకుమారి ఉంగరం తీసికెళ్లి ఆ పాము పుట్టలో తనను తరుముకు వచ్చే రాజభటులు చూస్తుండగా పడవేసింది. రాజభటులు పుట్టను త్రవ్వి పామును చంపారు పక్షులు సుఖంగా ఉన్నై. దుర్బలులు బలవంతుడైన శత్రువును ఉపాయం చేత సాధిస్తారు.

ఇంతట్లో గాలి వచ్చింది "పాపం ఆ అయ్యగారు వెళ్లిపోయారు" అంది

హోల అందుకుని "ఎంత మంచివాడు కాకపోతే నాలుగుత్తరాలు చేరవేయడానికి సలభై రూపాయలిస్తాడు." అంది.

"మూడేగా ఉత్తరాలు" అంది లీల

"ఇంటివారమ్మాయి దానితో నాలుగు" అంది మాల "ఆ ఉత్తరం నేను తీసికెళ్లలేదమ్మా" అంది గాలి అయితే ఒకరికి వ్రాసిన ఉత్తరాల సంగతి ఒకరికి తెలిసినందుకు ఖంగారు పడింది.

"నాలుగో ఉత్తరం నాకే వచ్చిందిగా" అంది హోల. మాల అందుకుని "ఓ గాలీ! నువ్వు వెళ్లిపో. మా యింట్లో ఇక అడుగు పెట్టకు మా చాకిరీ మేమే చేసుకుంటాము. లేకపోతే కృష్ణారావుకు మూడినట్లు నీకూ దేహశుద్ధి అవుతుంది" అంది.

"అల్లాగే పని మానేస్తాను అమ్మగారూ" అని గాలి వెళ్లిపోయింది.

"నాలుగో ఉత్తరం నీకు వచ్చిందా హోలా. మాకు చెప్పలేదేం" అంది లీల.

"అయితే ఆ ఉత్తరం ఇంటివారమ్మాయి గదిలో పడవేశావేమిటే. అందుకనా కథ చెబుతానంటూ మొదలెట్టావు ఇందాక" అంది మాల. "ఏమయినా యీ ప్రదక్షిణ నాయకుల నుండి మనం తప్పించుకోవాలంటే ఈ ఒళ్లు కనపడే బట్టలు మానేయాలి" అంది హోల.

కాలేజీకి వెళ్లేటప్పుడు కట్టుకోవడం కోసం ఆ సాయంత్రమే చేనేత బట్టలు కొన్నారు కన్యాత్రయం.

## నివేదన

(16 వ పేజీ తరువాయి)

దురాచారాలకీ. కట్టుబాట్లకీ ఆమె జీవితం ఎలా బలిఅయిపోయిందో చిత్రించడంలో రచయిత కృతకృత్యుడైనట్లు చెప్పవచ్చు. కామేశ్వరి పాత్ర పాఠకులకు జాలి కలుగుతుంది. ఆమెపట్ల పాఠకుల హృదయాలు సానుభూతితో నిండిపోతాయి.

ఈ నవలలో అక్కడక్కడ చిన్నచిన్న లోపాలు లేకపోలేదు. కాని అనుభవం గడించిన కొద్దీ రచయిత ఆ లోపాలను సవరించుకుంటాడన్న విశ్వాసం నాకుంది.

శ్రీ దక్షిణామూర్తిగారు ఇంకా ఎన్నో మంచి నవలలు తెలుగుపాఠక లోకానికి అందిస్తారని ఆశించవచ్చు.

—:o:—

## అష్టావధానము

ది 11-6-61 ఆదివారం సాయంకాలం గం. 7-00 లకు శ్రీ కృష్ణా క్లబ్ (మచిలీపట్టణము) వారి యాజమాన్యమున శ్రీ కొడాలి ఆంజనేయులుగారి అధ్యక్షమునందు శ్రీ కోట వీరాంజనేయశర్మగారిచే అష్టావధాన కార్యము నిర్వహింపబడినది. సభకు పలువురు విద్వత్కవులు, కవితాప్రియులు విచ్చేసిరి. అవధానానంతరము శ్రీ పువ్వాడ శేషగిరిరావు, శ్రీ గురజాడ రాఘవశర్మగార్లు అవధానిని ప్రశంసించిరి. అనంతరము కవిగారికి చందన తాంబూలాదు లొసంగి అర్ధనూట పదారు రూప్యములతో సత్కరించిరి. అధ్యక్షుల మలిపలుకుల యనంతరము క్లబ్బు ప్రెసిడెంటు శ్రీ తురగా వేంకటరావుగారు వందన సమర్పణము గావించుటతో సభ ఆనందముగా జయప్రదముగా ముగిసింది.